

17, 18 తేదీల్లో ఆర్థిక కమిషన్ పర్యటన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈ నెల 17, 18 తేదీలలో 16వ ఆర్థిక కమిషన్ రెండు రోజులు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. 17 వ తేది ఉదయం 11 గంటలకు ఆర్థిక కమిషన్ 15 మంది డెలిగేట్స్ తిరుపతి చేరుకుంటారని, ప్రోటోకాల్, బందోబస్తు, సెక్యూరిటీ పగడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డిఆర్ఓ నరసింహులు, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, సిపిఓ ప్రేమచంద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాదే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు

ఈవీఎంల వినియోగంపై సాధ్యాసాధ్యాలు పరిశీలన

జిల్లా అధికారులతో ఎలక్షన్ కమిషనర్ నీలం సాహ్ని



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) వచ్చే ఏడాదిలో పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విశ్రాంత ఐఏఎస్ అధికారిని నీలం సాహ్ని సూచించారు. గురువారం తిరుపతికి చేరుకున్న ఇరు తెలుగు రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు నీలం సాహ్ని, రాణి కుముదినికు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టరేట్ వద్ద పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా అధికారులతో మేథోమధన సమావేశం నిర్వహించారు. పంచాయితీ రాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకత ఉందని, ఇందుకోసం ప్రణాళికా బద్ధంగా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, మానవ వనరులు, పోలీస్ బలగాలు, ఎలక్టోరల్ రోల్ తదితర అంశాలపై దష్టి సారించి ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణ జరిగేలా సన్నాహాలు ఉండాలన్నారు. పంచాయితీ రాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఈవిఎంల వినియోగంపై పరిశీలిస్తున్నామని, వాటి సాధ్యా సాధ్యలపై అధికారుల సూచనలు సలహాలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు బడ్జెట్ తదితర అంశాలపై ముందస్తు అంచనాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రానున్న పంచాయితీ రాజ్, మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధతపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల సూచనలు ఎంతో విలువైనవన్నారు. ఈ మేధోమథన సమావేశంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డిఆర్ ఓ నరసింహులు, పంచాయితీ రాజ్ శాఖ, మునిసిపల్ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ అధికారులు, అదనపు ఎస్పి రవి మనోహరాచారి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవి, డిప్యూటీ కమిషనర్ తిరుపతి మున్సిపాలిటీ అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ చట్టం'పై టిడిపి అత్యుత్సాహం

మైనార్టీ రాష్ట్ర నాయకులు మహ్మద్ మగ్దూమ్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ దేశంలో వక్ఫ్ చట్ట సవరణపై తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతుంటే, మరోపక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వక్ఫ్ భూములను లీజు పేరుతో పెద్దలకు, బడాబాబులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం చాలా దారుణమని మైనార్టీ రాష్ట్ర నాయకులు మహ్మద్ మగ్దూమ్ అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం వక్ఫ్ చట్ట సవరణపై నిరసనలు తెలుపుతుంటే, చంద్రబాబు ప్రభుత్వం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ) పేరుతో వక్ఫ్ భూములను లీజుకు ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టి ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయడం దారుణమన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడటం కోసమే ఈ విధానాన్ని ప్రవేశపెట్టామని ప్రభుత్వం చెప్పడం నిజంగా కట్టుకథేనని విమర్శించారు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్యాక్రాంతమైన భూములను గుర్తించి, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేసి, ముస్లీం సమాజానికి లాభం చేకూరేలా చేస్తే బాగుంటుందని అన్నారు. అలాకాకుండా వక్ఫ్ ఆస్తులను లీజుకు టెండర్లు పిలవడం, ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వమే స్వయంగా అనడం విడ్డూరంగా ఉందన్నారు. గూడూరు నియోజకవర్గ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుష్త షేక్ కాలేషా, నియోజకవర్గ మైనార్టీ అద్యక్షులు జలీల్ మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ వక్ఫ్ ఆస్తులను టిడిపి సానుభూతిపరులకు కట్టబెట్టడం కోసమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కన్నా ఒక అడుగు ముందుకు వేసి ముస్లీంలను మోసం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వ ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు నిరసన తెలియజేసి వారి ప్రయత్నాన్ని అడ్డుకోవాలన్నారు.



నేడు ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం : టిటిడి ఛైర్మన్

పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుమల కడప జిల్లా ఒంటిమిట్టలో సాయంత్రం 6.30–8.30 మధ్య శ్రీసీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు చెప్పారు. ఒంటిమిట్ట ఆలయ ప్రాంగణంలోని పరిపాలన భవనం మీటింగ్ హాల్‌లో ఛైర్మన్, ఈవో జె.శ్యామలరావు, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈవో వీరబ్రహ్మం, జెసి అదితి సింగ్, ఎస్పీ ఈజీ. అశోక్ కుమార్, సివిఎస్వో హర్షవర్ధన్ రాజుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

ఛైర్మన్ మాట్లాడుతూ శుక్రవారం ఏకశిలానగరంలో సీతారాముల కల్యాణాన్ని టిటిడి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు సాయంత్రం 6 గంటలకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారని చెప్పారు. 147 గ్యాలరీలలో 60వేల మంది భక్తులు సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేలా ఏర్పాటు చేశామన్నారు. పారామెడికల్, టిటిడి ఉద్యోగులు, పోలీసు, శ్రీవారి సేవకులు ప్రతి గ్యాలరీలోనూ సేవలను అందిస్తారన్నారు. తలంబ్రాల పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తునికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారిలడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టామన్నారు. నడచి వచ్చే భక్తుల సౌకర్యార్థం 11 ప్రాంతాలలో ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇందులో పానకం, మజ్జిగ, చలివేంద్రం, వాటర్‌కూలర్లు, పోలీసు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. భక్తులు వేచి ఉండేలా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేలా 23 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. టిటిడి విజిలెన్స్ నుంచి 400 మంది, పోలీసు యంత్రాంగం నుంచి 2,500 మంది భద్రతా సిబ్బందిని బందోబస్తు నిమిత్తం కేటాయించారు. ఆర్‌టిసి ద్వారా కడప నుండి ఒంటిమిట్ట వరకు 85 బస్సులతో 425 ట్రిప్పులు, రాజంపేట నుండి ఒంటిమిట్ట వరకు 40 బస్సులతో 220 ట్రిప్పులు అనగా మొత్తం 645 ట్రిప్పుల ద్వారా భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. కళ్యాణ వేదిక ఆలయ పరిసరాలలో 250 మరుగుదొడ్లు, టిటిడి జిల్లా యంత్రాంగం సమన్వయంతో 3,268 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తారు. ఎస్వీబీసీ కల్యాణోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం అందించనుంది.

వేసవిలో 'మండే' చర్యలు

• బస్టాండ్‌లో తిరగని ఫ్యాన్లు • ప్రయాణికులకు ఉక్కపోత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి లాభార్జనే ధ్యేయంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో రోజుకో సంస్కరణను అమలు చేస్తోంది. ఈ క్రమంలో ఉద్యోగులు, ప్రయాణికులు ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నా తమకు పట్టనట్లు వ్యవహరిస్తోంది. నష్టమొస్తే చార్జీల మోత, వేతనాల్లో కోతకు దిగే యాజమాన్యం ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం విఫలమౌతోంది. ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ లో ఏర్పాటుచేసిన సీలింగ్ ఫ్యాన్లు గత కొంతకాలంగా సరిగా పనిచేయడం లేదు. గురువారం కూడా ఫ్యాన్లు తిరగకపోవడంతో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఎండలు క్రమంగా తీవ్రస్థాయికి చేరుకుంటుండడంతో ప్రయాణికులే కాకుండా పాదచారులు సైతం బస్టాండ్ లో కాసేపు ఫ్యాన్ల కింద సేదతీరుతుంటారు. అయితే ఫ్యాన్లు తిరగకపోవడంతో ఉక్కపోత కన్నా ఎండ తాకిడే నయమని బయటకు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి ఫ్యాన్లకు సకాలంలో మరమ్మత్తులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డిపో మేనేజర్ మునిచంద్రయ్యను వివరణ కోరగా రెండు రోజుల క్రితమే బస్టాండ్ లోని అన్ని ఫ్యాన్లకు మరమ్మత్తులు చేయించామని తెలిపారు. కొన్ని ఫ్యాన్లు సాంకేతిక సమస్యల కారణంతో తిరగకపోయి ఉండచ్చునీ, వెంటనే మరమ్మతులు చేయిస్తామంటూ వివరణ ఇచ్చారు.



అనుపల్లెలో ఈదురు గాలుల వర్షం

నెమ్మళ్ళగుంటపల్లిలో కొబ్బరి చెట్టుపై పిడుగు

ప్రజాశక్తి -రామచంద్రపురం ఎండ తీవ్రతతో విలవిలలాడుతున్న ప్రజలకు వరుణుడు కరుణించి గురువారం సాయంత్రం ఆర్సీపురంలో అనుపల్లి, వేప కుప్పం గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండ తాపానికి చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. ఈ నేపథ్యంలో నెమ్మల్లగుంటపల్లి గ్రామ సమీపంలోని పొలంలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో కొబ్బరి చెట్టులో మంటలు చెలరేగాయి. కొబ్బరి చెట్టులో పిడుగు పడి చెలరేగిన అగ్గి మంటలను పలువురు కెమెరాలో వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిరుజల్లులకు గ్రామంలో చిన్నారులు వాన వాన వల్లప్ప అంటూ వర్షంలో తడుస్తూ చిందులు వేస్తూ ఆనందంగా ఆడుకున్నారు.



నేడు సిఎం పర్యటనతో ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీరాములవారి కల్యాణ మహోత్సవానికి శుక్రవారం హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాకు వచ్చే వెళ్లే భారీ వాహనాలను భాకరాపేట, వయా పీలేరు, రాయచోటి మీదుగా ట్రాఫిక్‌ను ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మళ్లించినట్లు డిఎస్‌పి రామకృష్ణ చారి తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు భారీ వాహనాల మళ్లింపు ఉంటుందని పేర్కొన్నారు.



సినీ యాక్టర్ సప్తగిరిని పరామర్శించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ సినీ యాక్టర్ సప్తగిరిని చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురువారం పరామర్శించారు. సినీ యాక్టర్ హీరో సప్తగిరి అమ్మ చిట్టెమ్మ ఇటీవల ఆకస్మికంగా మరణించిన విషయం విదితమే. ఈ సందర్భంగా రాయల్ నగర్‌లోని ఆయన నివాసానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ వెళ్లి సప్తగిరిని పరామర్శించారు.

టీటీడీకి 100 సైకిళ్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల తిరుమల శ్రీవారికి గురువారం చెన్నైకి చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ 100 సైకిళ్లు విరాళంగా అందజేసింది. కంపెనీ ప్రతినిధులు సైకిళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. శ్రీవారి ఆలయ పేష్కార్ రామ కృష్ణ, ఇన్ ఛార్జ్ డిఐ హరి బాబు పాల్గొన్నారు.

రేపు తిరుపతికి మాజీ ఉప రాష్ట్రపతి రాక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తిరుపతి పర్యటన ఖరారయ్యింది. 12, 13 తేదీల్లో తిరుపతిలోపర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉదయం 7.45కు బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు కేచ్పపి ఆడిటోరియంలో 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' సెమినార్‌లో ప్రసంగిస్తారు. సాయంత్రం 5 గంటలకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని ఇండోర్ ఆడిటోరియంలో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 13వ తేదీ ఉదయం 8.20 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు.

ఇంజినీరింగ్ విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి తగదు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చివరి సంవత్సరం విద్యార్థులు ఫీజులు మొత్తం చెల్లిస్తేనే ప్రాజెక్టు వర్కుపై సంతకాలు చేస్తామని యాజమాన్యం ఒత్తిడి చేయడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, భగత్‌రవి పేర్కొన్నారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. కలెక్టర్, వెల్ఫేర్ అధికారులు స్పందించి అన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వం చెల్లిస్తుందన్న భరోసాను ఇవ్వాలని, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ విద్యార్థి సైతం ప్రాజెక్టు వర్కుపై సంతకం చేయలేదన్న కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయని సూచించారు.

నవీన్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం కిరణ్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో తిరుపతి బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల నవీన్ మాతమూర్తి అకాల మరణం చెందిన విషయం విదితమే.. కర్మ క్రియల కార్యక్రమానికి హాజరు కాలేకపోవడంతో గురువారం మాజీ సీఎం, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి తిరుపతిలోని వివి మహల్ రోడ్ లో ఉన్న నవీన్ కుమార్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. వారి మాతమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

తుడా ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం, సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తుడాలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాచా శ్రీదేవి ఆక్రమించి, అడ్డంగా పెట్టిన గేటును తొలగించి, ఆమె నుంచి రోడ్డును స్వాధీనం చేసుకోవాలని సీపీఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు పి.మురళి, వందవాసి నాగరాజు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కోరారు. రోడ్లను కాపాడాల్సిన తుడా సంస్థలో పనిచేస్తున్న శ్రీదేవి రోడ్డును ఆక్రమించినందుకు ఆమె పైన తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లో ఉంటున్న రాచా శ్రీదేవి సంబంధించి 1997లో కొన్న డాక్యుమెంట్లలోనూ పది అడుగుల రోడ్డు ఉన్నట్లుగా ఉందని పేర్కొన్నారు. అయితే రోడ్డును ఆక్రమించి అడ్డంగా గేటు పెట్టి, ఎవరినీ రానీకుండా దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, పౌరచైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్, గౌరవాధ్యక్షులు రాఘవ, బాధితుడు ఎ.వేణుగోపాల్ కలిసి వినతిపత్రం అందజేశారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

రెవెన్యూ శాఖలో సంస్కరణలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ రెవెన్యూ సేవలు మరింత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, విస్తృతంగా ఎలాంటి భూవివాద రహితంగా ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించేందుకు రెవెన్యూ శాఖతో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూసంబంధిత రెవెన్యూ, సర్వే అంశాలే ఎక్కువ అర్జీలుగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ శుభం బన్సల్, డిఆర్ఒ నరసింహులు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి రెవెన్యూ, సర్వే అంశాలపై వర్కుషాపు నిర్వహించారు. ల్యాండ్ అలియనేషన్, సెక్షన్ 22ఎ, భూముల క్రమబద్దీకరణ, అసైన్మెంట్, ఆర్ఒఆర్ వెబ్‌ల్యాండ్ సమస్యలు, ఫ్రీహోల్డ్, ఇనామ్/ఎస్టేట్ తదితర భూ సంబంధిత, రెవెన్యూ, సర్వే సమస్యలపై సిసిఎల్ఎ ఆదేశాల మేరకు వర్కుషాపులో చర్చించారు. ప్రస్తుతం ఉన్న జీవోలు, మార్గదర్శకాల స్థానంలో ఏమైనా అవసరమైన మార్పులు చేర్పుల కొరకు వర్కుషాపు నిర్వహించి సూచనలు పంపాలని తెలిపిన నేపథ్యంలో ఈ వర్కుషాపులో మేథోమథనం జరిపి సిసిఎల్ఎకి పంపనున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్ మండ్, సుధారాణి, తిరుపతి, శ్రీకాళహస్తి, ఆర్డీవోలు రామ్ మోహన్, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి వసంతోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుమల తిరుమలలోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు గురువారం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఎండ వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని ఉపశమనోత్సవం అని అంటారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదిస్తారు.శనివారం ఉదయం 8–10 గంటల మధ్య మలయప్పస్వామివారు స్వర్ణరథంపై తిరుమాడావీధుల్లో ఊరేగుతారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామ కష్ణ పాల్గొన్నారు.

'ఒలింపియాడ్' లో శ్రీ చైతన్య ప్రతిభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంటెడ్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ ఏడాది జరిగిన ఐఎన్ఎస్టిఓ లెవల్ –1 లో గెలుపొందిన విద్యార్థులు లెవల్ –2 రాయగా అందులో లేఖనాసాయి(6 వ తరగతి) మొదటి బహుమతిని, లెనోవో లాప్ ట్యాప్ ను అందుకుంది. 2, 3, 4 బహుమతులను అదే పాఠశాలకు చెందిన మోక్షిత(3వ తరగతి), దాలిత్య(4వ తరగతి) పొందారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రూపాదేవి అభినందించారు. పాఠశాల ఇన్చార్జిలు త్రివేణి, కల్పన, డీన్ సుబ్రమణ్యం, అయ్యన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తుంబురు తీర్థ ముక్కోటి

ప్రజాశక్తి - తిరుమల శుక్ర, శనివారాల్లో తిరుమలలో తుంబురుతీర్థ ముక్కోటి జరగనుంది. ఉదయం 5 గంటల నుంచి పది గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఇస్తారు. భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, మందులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంచనున్నారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60 ఏళ్లు పైబడిన వద్ధులు, గుండె, శ్వాస కోస సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు. భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. పోలీసుశాఖ, అటవీశాఖ, టీటీడీ విజిలెన్స్ విభాగం సమన్వయంతో పాపవినాశనం నుండి తుంబురు తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నారు. తీర్థానికి వెళ్లే మార్గంలో సూచి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీని దష్టిలో ఉంచుకుని గోగర్భం డ్యామ్ సర్కిల్ నుండి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతి ఉండదు.

ప్రజా మద్దతుతో సిపిఎం పోరాటాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ప్రజలు ఇస్తున్న ఆర్థిక, నైతిక మద్దతుతో ప్రజా క్షేత్రంలో అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. మే 8న తిరుపతిలో ప్రారంభం కానున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల విజయవంతం కోసం గురువారం పట్టణంలో ఆర్థిక విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. జోలి పట్టి ఆర్థిక, నైతిక సహకారాన్ని అందించాలని ప్రజలను అర్థించారు. సిపిఎం ఆర్థిక విరాళాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన, మద్దతు లభించిందనీ, ఇదే ఆదరాభిమానాలు భవిష్యత్తు పోరాటాలకూ ఉండాలని పుల్లయ్య కోరారు. ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, గురునాధం, రాధమ్మ, సుబ్రమణ్యం, ప్రసాద్, ప్రవళ్ళిక, రాజా తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బిబి'ని సందర్శించిన కె.నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి తిరుపతి తిలక్‌రోడ్డులోని ఎస్‌బిబి మెడికేర్ సంస్థను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్‌కె.నారాయణ సందర్శించారు.మెడికేర్ అధినేత కెవిచౌదరి, లోకేష్‌చౌదరి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణ మందుల షాపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిస్కౌంట్ ధరలతో ప్రజలకు సేవ చేయడం మంచిదేనని, అదేవిధంగా జనరిక్ మందులు మరింత తక్కువ ధరకు అందజేయాలని సూచించారు. జనరిక్ మందులను ప్రభుత్వం ఆదరించాలని కోరారు. అన్ని మెడికల్ షాపుల్లో జనరిక్ మందులను అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు.

ఆదిమూలం... గందరగోళం..!

• సస్పెన్షన్ సరే..ఇన్‌ఛార్జి ఎవరు? • ఎంఎల్ఎ తీరుపై విమర్శల పర్వం • సత్యవేడు టిడిపిలో గందరగోళం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా సత్యవేడు టిడిపి పరిస్థితి ఉంది. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి. పార్టీ మారినా ఆయన తీరు మారలేదు. గతంలో వైసిపి హయాంలో ఎంఎల్ఎగా ఉన్న పుడు కొత్తగా పార్టీలోకి వచ్చిన టిడిపి కార్యకర్తలకు అందల మెక్కించారన్న కోపం అప్పటి వైసిపి కార్యకర్తల్లో ఉండేది. ప్రస్తుతం టిడిపి కండువా కప్పకుని ఎంఎల్ఎగా గెలుపొందిన ఆదిమూలం ఏకపక్షంగా ఉంటూ ఎవరినీ కలుపుకుపోయే పరిస్థితి లేదు. దీంతో సత్యవేడు నియోజకవర్గం కార్యకర్తల్లో నిరాశ నెలకొంది. త్వరలోనే తనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తి వేస్తారని ఆదిమూలం అనుకుంటున్నా, అధిష్టానం మాత్రం అతనిపైన గుర్రుగానే ఉందని సమాచారం. అయితే ఎంఎల్ఎపై సస్పెన్షన్ వేటు విధించిన అధిష్టానం సైతం, ఇప్పటివరకూ సత్యవేడు నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిని ప్రకటించకపోవడమూ ఈ గందరగోళానికి కారణమయ్యిందని చెప్పవచ్చు.

సీఎం చంద్రబాబు సొంత జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి గందరగోళంగా మారింది. పదేళ్ల తర్వాత మొన్నటి ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఓ మహిళతో వీడియోలో కనిపించి అడ్డంగా బుక్కయ్యారు. దీంతో నియోజకవర్గంలో వెంటనే దిద్దుబాటు చర్యలు ప్రారంభించిన టిడిపి అధిష్టానం..ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఆదిమూలాన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోందన్న టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.త్వరలోనే కొత్త ఇన్‌ఛార్జిని నియమిస్తారని పార్టీ అధిష్టానం ప్రకటించినా, ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఎవరి నాయకత్వంలో పనిచేయాలో తెలియక సత్యవేడు తెలుగు తమ్ముళ్లు అయోమయానికి గురవుతున్నారు.

కొనసాగుతున్న సస్పెన్షన్ వేటు

ఈ విషయంలో పార్టీ అధిష్టానంలో మాత్రం ఇంకా ఊగిసలాటే కనిపిస్తుందన్న వాదన విన్పిస్తోంది. ఎమ్మెల్యే ఆదిమూలంపై ఇంకా సస్పెన్షన్ వేటును కొనసాగిస్తూనే ఉంది. ఈ వ్యవహారం ఇలా ఉంటే సత్యవేడు టిడిపి నేతలు మాత్రం ఇదెక్కడి తలనొప్పి అంటూ తలలు పట్టుకుంటున్నారంట. పనుల కోసం ఎమ్మెల్యే వద్దకు వెళ్లాలా, వద్దా అని తేల్చుకోలేకపోతున్నారని సమాచారం. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ను సైతం నియమించకపోవడంతో ఇక్కడ అంతా గందరగోళ వాతావరణమే కన్పిస్తోంది. ఎవరినో ఒకరిని ఇన్చార్జ్ గా అయినా వేయండి లేదా ఆదిమూలంపై సస్పెన్షన్ను ఎత్తివేయండి అంటూ సత్యవేడు తెలుగు తమ్ముళ్లు నిలదీస్తున్నారని సమాచారం. గంగా ప్రసాద్ అనే సీనియర్ టిడిపి నేత పార్టీ తరపున నియోజకవర్గానికి పెద్దదిక్కుగా ఉంటున్నారట. ఆయన కనుసన్నల్లోనే సత్యవేడు నియోకజవర్గానికి సంబంధించిన పార్టీ వ్యవహారాలన్నీ కొనసాగుతున్నాయని సమాచారం.ఆయన ద్వారా నియోజకవర్గ పార్టీ ఇంన్చార్జి పదవి దక్కించుకునేందుకు చాలామంది స్థానిక నేతలు ఆయన వద్దకు క్యూ కడుతున్నారని తెలుస్తోంది.



అయితే నియోజకవర్గంలోనూ గంగా ప్రసాద్ కు వ్యతిరేకవర్గం కూడా తయారైందట. మొన్నటి ఎన్నికల ముందు వరకు సత్యవేడు టిడిపి ఇంన్చార్జిగా కొనసాగిన మాజీ ఎమ్మెల్యే హేమలత సైతం ఇప్పుడు మళ్లీ ఇంన్చార్జి పదవిని ఆశిస్తున్నారన్న టాక్ నియోజకవర్గంలో కోడై కూస్తోందట. మొత్తం మీద సత్యవేడు నియోజకవర్గం విషయంలో ఆచితూచి వ్యవహరించాలని పార్టీ అధిష్టానం భావిస్తుండగా..లోకల్ కేడర్ మాత్రం ఈ తలనొప్పికి ఫుల్ స్టాప్ పడేదెప్పుడని ఎదురుచూస్తున్నారంట.

కోతుల బెడద

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధి, పోలీస్ స్టేషన్ ప్రక్కనున్న బాలికల హైస్కూల్లో కోతుల బెడద ఎక్కువైంది. విద్యార్థినులు భోజనాలు చేసేటప్పుడు, తినబోయే దారులు తెచ్చుకునేటప్పుడు కోతులు వారిపై దాడి ఆహార పదార్థాలు లాక్కుంటున్నాయి. గురువారం స్కూలు ఆయా సంపూర్ణ కోతుల్ని తరిమే ప్రయత్నం చేయగా, ఒక కోతి ఆమెపైకి దూకింది. దాంతో ఆమె పరిగెత్తుకుంటూ కాలు జారి మెట్లపై నుండి కిందికి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు ఎముక విరిగింది. పాఠశాల సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అధికారులు స్పందించి, కోతుల బెడద లేకుండా చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి కోతుల బెడద లేకుండా చేయాలని సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. కాలు విరిగిన స్కూల్ ఆయాను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం వి రమణ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి - బాలాయపల్లి: గొట్టి కాడు అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి పౌష్టికాహారం, రోజుకు 5 లీటర్ల నీరు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు హేయం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటిడిపి సభ్యుడు కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మండల వైసీపీ కన్వీనర్ మణి నాయుడు గురువారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలపై వ్యాఖ్యలు చేస్తే ఎంతటివారైనా క్షమార్హులు కాదన్నారు.

ప్రజాశక్తి - పెళ్లకూరు:
వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి పెళ్లకూరు సబ్ ఇన్స్పెక్టర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. 7వ తేదీ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన అసభ్య పదజాలంతో పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఈ పోస్ట్‌లు రూపొందించి, ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ వినతి పత్రంలో కోరారు.

సంస్కృత విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి - క్యాంపస్ : కేంద్రమంత్రి గిరిజన వ్యవహారాల శాఖామాత్యులు జుయల్ ఓరం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయాన్ని గురువారం సందర్శించారు. విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ అధికారులతో, గిరిజన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విద్యార్థులకు కేంద్ర గిరిజన స్కాలర్‌షిప్ రావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీ వైజ్ డైరెక్టర్ డా. జ్ఞానరంజన్ పాండా, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆద్య ఫెర్టిలిటీ అండ్ ఉమెన్ క్లినిక్ ప్రారంభం




ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆద్య ఫెర్టిలిటీ ఉమెన్స్ క్లినిక్‌ను గురువారం తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని తిమ్మినాయుడుపాలెం, మంగళం రోడ్డు, రాయల్ ఓక్ ఫర్నిచర్ షోరూమ్ సమీపంలో ఆధునిక పరికరాలతో డాక్టర్ దీప్తి దామోదర్ క్లినిక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ దీప్తి గైనకాలజిస్ట్ అండ్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ వారి సేవలు వినియోగించుకోవాలని నగర ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప్తి, క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులు ఆహారంలో పురుగులు


నాణ్యత లోపిస్తున్నా పట్టించుకోని రుయా అధికారులు





ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అసలే అనారోగ్యం... ఆపైన ఆసుపత్రుల్లో చికిత్స.. అది పేదల ఆసుపత్రి కాబట్టి నిర్లక్ష్యం మామూలే... అక్కడ క్యాంటీన్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పురుగులతో కూడిన ఆహారాన్ని తినాల్సిన దుస్థితి నెలకొంది. ముందే అనారోగ్యం... ఆపైనా నాణ్యత లేని ఆహారం తినడం వల్ల ఆరోగ్యం మరింత క్షీణిస్తుంది.. అయినా తప్పక ఇబ్బంది పడుతున్న పేద రోగులు. రుయా ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యానికి మరో నిదర్శనం ఇది. గురువారం రాత్రి ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన కే కృష్ణారావుకు పెరాలసిస్ సోకడంతో ఏప్రిల్ రెండవ తేదీ తిరుపతి రుయా హాస్పిటల్లో అడ్మిట్ అయ్యారు. ఎంఎం-3 వార్డులో చికిత్స పొందుతున్నారు. రోగికి, రోగి వద్ద ఉన్న సహాయకులకు, ప్రభుత్వం తరఫున ఆసుపత్రిలో ఉచితంగా ఆహారం పంపిణీ చేస్తారు. కానీ ఆహార తయారీలో నాణ్యత లోపించడంతో బాగా లేకున్నా పేద రోగులు విధిలేని పరిస్థితిలో వాటిని తినేవారు. ఆహార నాణ్యత లోపంపై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి చపాతి కోడిగుడ్డును రోగులకు పంపిణీ చేశారు. పెరాలసిస్ రోగి కృష్ణారావు సహాయకురాలైన సువర్ణ లక్ష్మికి ఆసుపత్రి ఉచిత క్యాంటీన్ నుంచి చపాతిని పంపిణీ చేశారు. రోగికి సపర్యలు అనంతరం కొద్దిసేపు తర్వాత చపాతిని తినేందుకు సువర్ణ లక్ష్మి సిద్ధం అయింది. ఆ చపాతిలో బొద్దింక ఉండడాన్ని చూసి భయపడింది. అక్కడ ఉన్న ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. అయినా క్యాంటీన్ నిర్వాహకులు మాత్రం స్పందించలేదు. ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యం వల్ల, నిత్యం పేద రోగులకు సరఫరా చేసే ఆహారంలో నాణ్యత లోపిస్తుందని, రుచి శుభ్రత ఉండటం లేదని, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, క్యాంటీన్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని, రోగులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పేదలంటే అలుసా..?



రుయా ఆసుపత్రి అంటే పేదల ఆసుపత్రి. కానీ ఇక్కడ పేదలంటే అందరికీ అలుసే. ఎవరిని అడిగినా దిక్కున్న చోట చెప్పుకోండి అంటున్నారు. ఆసుపత్రిలో ఉంచి చికిత్స చేయిస్తున్నాం. ప్రతిరోజూ నా కుమారుడు బయటి నుంచి మాకు ఆహారం తెచ్చి ఇస్తున్నాడు. ఇబ్బందిగా అత్యవసర పనులు ఉండడంతో, గురువారం సొంత ఊరు మదనపల్లికి వెళ్లాడు. దీంతో విధిలేని పరిస్థితిలో ఆసుపత్రిలో సరఫరా చేసే ఉచిత ఆహారాన్ని తీసుకుని, కొద్దిసేపు తర్వాత తినేందుకు ఉపక్రమిస్తే, అందులో బొద్దింక ఉండడంతో భయమేసింది. పేద రోగులంటే నిర్లక్ష్యం వీడి అధికారులు స్పందించి మంచి ఆహారాన్ని అందించాలి.

-సువర్ణ లక్ష్మి, బాధితురాలు, ఎస్టీవో, మదనపల్లి

మాయమైపోతున్న ప్రభుత్వ భూములు

- ఆక్రమణకు గురవుతున్న రోడ్లు
- ప్రభుత్వ భూమిలో షాపులు నిర్మించి అద్దెకు
- ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు.. పొంచిఉన్న ప్రమాదం
- స్పందించని ఆర్ అండ్ బి అధికారులు

ప్రజాశక్తి - నాయుడుపేట:

తిరుపతి జిల్లా, నాయుడుపేట పట్టణంలో ప్రభుత్వ భూములు రోజురోజుకీ కనుమరుగైపోతున్నాయి. అధికారులు స్పందించకపోవడంతో ఎవరిష్టానికి వారు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా వారిలో ఏమాత్రం చలనం రావడం లేదు. ఇదే అవకాశంగా అక్రమణదారులు మరింత రెచ్చిపోతున్నారు. ఇక్కడ మరి ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఆర్ అండ్ బి శాఖ అధికారుల నిర్లక్ష్యం గురించి మాత్రమే.





ఆర్ అండ్ బి శాఖ వారి తీరే వేరు అన్నటుగా ఉంది ఆ శాఖ అధికారుల విధాన శైలి. ఈ శాఖకు సంబంధించిన పట్టణంలోని ప్రధానాధికారులైన డిఈ పరమేశ్వరి, జెఈ చెన్నరాయుడులకు పాపం వారి భూములు ఎక్కడున్నాయో కూడా వారికి తెలిసినట్టుగా లేదు వీరి ఉదార స్వభావానికి ఈ క్రమంలో ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యపు విధానాలకు ముగ్ధులైన కొంతమంది వ్యాపారస్తులు ఇష్టానుసారంగా ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించుకుని వాటిని అద్దెలకి ఇచ్చేసి రద్దీగా ఉన్నచోట రోడ్డుకు అడ్డంగా వ్యాపారాలు చేయిస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. ఇలాంటి దారుణమైన పరిస్థితులను ఫోటోలు తీసి వారిముందుంచి ప్రజల ప్రాణ రక్షణకై రోడ్డు పక్కనున్న ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించుకుని ప్రమాదాలు కలిగించేలా వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు విన్నవించినా వారిలో ఏమాత్రం చలనం కలగకపోవడం ఆశ్చర్యం. ఈ శాఖకు సంబంధించిన భూములు అన్యాక్రాంతమైపోతున్నాయని వివరాలతో సహా పత్రికల్లో పలుమార్లు కథనాలు రాసినా పై అధికారులు ఏమాత్రం స్పందించకపోవడంతో ఈ శాఖ తీరు పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండు సంవత్సరాల ముందు నాయుడుపేట నుంచి చెన్నైకి వెళ్లే దారిలో ట్రినిటీ హాస్పిటల్ ముందు రైల్వే బ్రిడ్జిపై వీళ్ళు నిర్మించిన రోడ్డు అత్యంత ప్రమాదంగా మారింది. ఆ రోడ్డు చూస్తే రోడ్లు భవనముల శాఖ వేసిన రోడ్డేనా అనే అనుమానాలు కలుగక మానవు. పివిఎస్ హాస్పిటల్ నుంచి ట్రినిటీ హాస్పిటల్ మధ్యలో కొయ్యల మిల్లుల యజమానులు వారి మిల్లుల ముందున్న ఆర్ అండ్ బి స్థలాన్ని ఆక్రమించుకుని మిల్లులో కలిపేసుకోవటమే కాక, రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని కూడా ఆక్రమించుకుని నర్సరీలకు, మరి కొన్ని షాపులకు అద్దెల కిచ్చి వీరి ధనార్జన కోసం రోడ్డుకు అడ్డంగా వ్యాపారాలు చేయిస్తూ ఎన్నో ప్రమాదాలు కారకులవుతున్నారు. ఇలాంటివి ఎన్నో ఆక్రమణలు బహిరంగంగా కనిపిస్తున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఒక పేదవాడు ఊరికి దూరంగా ఎక్కడో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో నీడ కోసం చిన్న పాక వేసుకుంటేనే అధికారులందరూ ఒక్కటిగా కలసి ఆ గూడును క్షణాల్లో తీయిస్తారు. అలాంటిది ఉన్నవాడు మాత్రం బహిరంగ ప్రదేశాలను ఆక్రమించుకున్నా, దాని వల్ల ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, ఎంతో మంది వ్యతిరేకిస్తున్నా అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంలో అంతర్యం ఏమిటో..? ఉన్నవారిపై మాత్రమే అధికారులకు ఇంతటి ఉదారత ఎందుకు చూపిస్తున్నారో వాళ్లే వివరించాలి. భారీ వాహనాలు, చెన్నై, విజయవాడ, నెల్లూరుల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రాకపోకలకు నాయుడుపేటకు చుట్టు పక్కల పల్లెల నుంచి వచ్చే ఆటోలు ద్విచక్ర వాహనాలతో నిత్యం అత్యంత రద్దీగా ఉండే రహదారి అటువంటి రోడ్డుపై పూల చెట్లు, పరుపులు, కుర్చీలు ఇలాంటివి కొనడానికి ఆ షాపుల ముందు రోడ్డుపై కార్లు ఆటోలు బైకులు ఆపేసి ప్రమాదాలు జరిగే ఆవకాశాన్ని సృష్టిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోతున్నా ఆర్ అండ్ బి అధికారులు ఏమాత్రం చలించటం లేదు. ఓ పక్క ప్రజల ప్రాణాలు, మరోపక్క ప్రభుత్వ భూములు అక్రమణదారుల ధన దాహానికి ఆవిరైపోతుంటే ఆర్ అండ్ బి అధికారులు వారికి వంత పాడుతూ జేబులు నింపుకుంటూ వేడుక చూస్తున్నారు. జరుగుతున్న కబ్జాలపై ఆర్ అండ్ బి అధికారులను పలుమార్లు వివరణ కోరగా గత రెండు సంవత్సరాల నుంచి వారు చెబుతున్న సమాధానం ఒక్కటే తహసిల్దార్‌కి లేఖ రాశాం సర్వేయర్‌ని పంపిస్తామన్నారు, మునిసిపాలిటీ వారు మాకు సహకరించటం లేదు అంటూ ఏదో ఒక శాఖపై తోసేసి చేతులు దులుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప సరైన సమాధానం ఇవ్వడం లేదు. వీరి స్వలాభం కోసం సంబంధంలేని కారణాలతో రోజులు గడుపుతున్నారే గాని ప్రజల ప్రాణాలకు విలువివ్వటం లేదన్నది కనిపిస్తున్న వాస్తవం. ఇప్పటికైనా పై అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి ప్రజల ప్రాణాలను, ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో తరంగ్-2025





బహుమతి ప్రదానం చేస్తున్న విసి సుదర్శన్ రావు, శ్రీరామ కళాశాల యాజమాన్యం, సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థుల భవిష్యత్తుకు కమ్యూనికేషన్ స్కిల్స్ పాత్ర చాలా కీలకమైనదని, ఇంజనీరింగ్ పూర్తయ్యేలోపు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని జేఎన్టీయూ ఉపకులపతి సుదర్శన్ రావు విద్యార్థులకు సూచించారు. గురువారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల వార్షికోత్సవం తరంగ్-2025 పేరుతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి సుదర్శన్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం పరిశోధన విద్యకు ఉన్న ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే ఉద్యోగ వేటలో ఒక యేడాది గడిచిందంటే మరో ఇంజనీరింగ్ బ్యాచ్‌తో కలిశిపోతారన్నారు. పట్టుదలతో కళాశాలలో ఉన్న సౌకర్యాలను వినియోగించుకొని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయుక్తమైన ఆవిష్కరణ చేసి చిరస్థాయి గుర్తింపు పొందేలా విద్యార్థులు నూతన ఆలోచనలను కలిగి ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు విద్యే ప్రామాణికం కాదని, రైతులు వారికి అవసరమైన పనులకు సంబంధించి కొత్త ఆలోచనలను చేస్తూ గుర్తింపు సాధిస్తున్నారని తెలిపారు. సెల్ ఫోన్ వినియోగం తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఏడాది ఏఐసిటిఈ అనుమతితో 250 ఇంజనీరింగ్ సీట్లు అదనంగా లభ్యమవుతాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కీర్తిసాగర్ నాయక్ మాట్లాడుతూ క్యాంపస్ రిక్రూట్మెంట్లో ఎంతోమంది విద్యార్థులు కమ్యూనికేషన్స్ స్కిల్స్ లేక, ఉద్యోగాలు పొందలేకున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం జేఎన్టీయూ విసి సుదర్శన రావును శ్రీరామ కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యాసంస్థల డైరెక్టర్ మన్నెం వెంకటరామిరెడ్డి, కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవిందు కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర, ప్రోగ్రాం కన్వీనర్ మునిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించాల్సినటువంటి ఎగ్జామ్స్‌ని ఇవాళ జిల్లా దాటి కొన్ని ప్రాంతాల్లో నిర్వహించడం వలన విద్యార్థుల నుండి మాస్ కాపీ చేయించుటకు వేలకు వేలు ఫీజులు వసూలు చేయడం జరిగిందని, ఆ పరీక్ష కేంద్రాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్వీయూ ఇన్చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావుకు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీతి నిజాయితీగా కష్టపడి పరీక్షలు చదువుకొని రాసిన విద్యార్థులకు మాస్ కాపీయింగ్ కొట్టే విద్యార్థులతో పోటీ పడలేక తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దూరవిద్య పరీక్షా కేంద్రాల్లో ఎక్కడైతే మాస్ కాపీయింగ్ జరిగిందో ఆ కేంద్రాలపై విసి ప్రత్యేకమైన కమిటీ వేసి అక్కడికి పరీక్షలు అబ్జర్వర్లో వెళ్ళిన అధికారులను, ఆ సెంటర్ అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కమిటీ నేతలు ప్రేమ్ కుమార్, అజిత్, బాలాజీ, లోకేష్, ముని, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో 3 వ స్థానం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రంలో పన్నుల వసూళ్లలో తిరుపతి నగరపాలక సంస్థ మూడవ స్థానంలో నిలవ డంతో రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ అధికారులు కమిషనర్ ఎన్.మౌర్యను అభినందించి జ్ఞాపికను అందించారు. గురువారం పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కమిషనర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. రాష్ట్రంలో పన్నుల వసూళ్లలో తిరుపతి మూడవ స్థానంలో నిలవడంతో ప్రత్యేక కార్యదర్శి సురేష్, సి.డి.ఎం.ఏ. సంపత్ కుమార్ లు కమిషనర్ ఎన్.మౌర్యను అభినందించి సన్మానించారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, 18000 రూ. జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, 2వ రోజు కొనసాగుతున్న నిరసన ధర్నా కార్యక్రమం జరిగింది. గత ప్రభుత్వంలో 11000 వేలు ఉన్న జీతాన్ని మాజీ ఎమ్మెల్యే చొరవతో 13000 వేల రూపాయలు పెంచారని పారిశుద్ధ్య కార్మికులు వెల్లడించారు. ప్రభుత్వ జీవో ఉన్నా కూడా నిబంధనలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం మాకు అన్యాయం చేసిందనీ అన్నారు. మేజర్ పంచాయతీ రేణిగుంట ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉండగా, కార్మికులకు జీతాలు ఇవ్వడంలో అన్యాయం జరుగుతుందని కార్మికుడు రమణ వాపోయారు.

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ముదిరాజ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసీపీ రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణు వర్ధన్ ముదిరాజు పేర్కొన్నారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న కోమటి విష్ణు వర్ధన్ ముదిరాజ్‌ని గూడూరు వైసపీపీ మాజీ కౌన్సిలర్, ప్రస్తుత వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య పరంగా, వెనకబడి వున్నారని, ముదిరాజ్ బిడ్డలను బాగా చదివించి మాచి స్థాయికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోనం శేషగిరిరావు ముదిరాజ్, పాము రవికుమార్ ముదిరాజు , పెరుమాళ్ళ వీరన్న ముదిరాజ్ , మనిమేల రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జెజీ శేఖర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజ్ వద్ద ఎన్ఎంయు నేతలు నిరసన తెలిపారు. సర్కులర్ 1/19ను యధావిధిగా అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మెరుగైన ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు చేయడంతో పాటు మెడికల్ లీవ్ కమిటేషన్ ప్రాతిపదికన ప్రతి నెల జీతం ఇవ్వాలని సూచించారు. మహిళా కండక్టర్ లకు చైల్డ్ కేర్ లీవ్ ఇచ్చి న్యాయం చెయ్యాలనీ, అక్రమ సస్పెన్షన్లను ఆపాలని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలనీ, శ్రీకాళహస్తి డిపో పరిధిలో కండక్టర్, డ్రైవర్ల కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రీజినల్ నాయకులు వైడీ కుమార్, జోనల్ నాయకులు ఎల్వీకే రావు, మురళి, శివ కుమార్, ఎమ్మెస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎన్.ఎం.యు.ఏ నాయకులు కోరారు. గురువారం గూడూర ఆర్టీసీ డిపో వద్ద ఎన్.ఎం.యు.ఏ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/19 సర్క్యులర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ అహ్మద్, డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, గ్యారేజి సెక్రటరీ ప్రవీణ్, ట్రెజర్ గౌస్, రాజేష్, శేఖర్, అచ్యుత రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ కాలనీలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చొరవ చూపారు. రెండు నెలల కిందట మోటారు బోర్లను ఏర్పాటు చేసిన అధికారులు, గురువారం కాలనీ మొత్తానికి పైపులైను వేశారు. రాజీవ్ నగర్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారని టిడిపి పట్ల అధ్యక్షులు విజయకుమార్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ శేఖర్‌లు పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్ కళాశాలలో స్పార్క్-25 స్పీచ్ కాంపిటీషన్



రమ్యకు బహుమతి ఇస్తున్న కళాశాల సంచాలకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి, ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో స్పార్క్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ తెలిపారు. డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు స్పార్క్ -25 పేరిట స్పీచ్ కాంపిటీషన్, వీడియో ప్రజెంటేషన్, గ్రూప్ డిస్కషన్ వంటి విభాగాలలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా బిఎస్సి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని రమ్య నిలచి రూ.5 వేల రూపాయల నగదు బహుమతిని అందుకున్నారన్నారు. అలానే ద్వితీయ స్థానంలో బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని మోహిత రూ.3 వేలు, తృతీయ స్థానంలో బీబీఏ విద్యార్థిని సాయి కీర్తన నిలిచి వెయ్యి రూపాయల నగదు బహుమతిని అందుకున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఇటువంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కళాశాల సంచాలకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణయతలు శ్రీరాం బాబు, పాల్ సుధాకర్, ఉపసంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లి, అధ్యాపకులు భానుకిరణ్, గ్రేస్ వినీల, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వెనుకబడిన తరగతులకు గ్రామ సర్పంచి నుండి అసెంబ్లీ, శాసనమండలి చట్టసభలలో అవకాశం వచ్చేలా 52 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివ నాగేశ్వరరావు గౌడ్ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 52 శాతం రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సీఎం చంద్రబాబుకు ఇటీవల విజ్ఞప్తి చేశామన్నారు. బీసీల రిజర్వేషన్ తెలంగాణలో 42 శాతం, తమిళనాడులో 65 శాతంగా ఉందన్నారు. బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ త్వరలోనే తిరుపతిలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు నాగరాజు గౌడ్ తెలిపారు. సమావేశంలో వెంకట శివరాం గౌడ్, మధు ఆచారి, సోమశేఖర్, యశోద తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటే సీఎం లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలన్నదే ముఖ్య మంత్రి లక్ష్యమని, ఈ విషయమై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌తో ఆయన చర్చించడం జరిగిందని ఏసిఏ రాష్ట్ర అధ్యక్షులు, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం ఆయన ఎసిఏ రాష్ట్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్, చిత్తూరు ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్)ని స్థానిక లీలామహల్ సమీపంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విలేకరుల ఏసీఏ అధ్యక్షులు మాట్లాడుతూ విజయ్ చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ లోనే కాక ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో కూడా కీలక భాగస్వామిగా వ్యవహరిస్తున్నారన్నారు.రాష్ట్రం నుంచి ఎక్కువమంది క్రికెట్ క్రీడాకారులు ఐపీఎల్ ఆడాలనే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పలువురు క్రికెట్ క్రీడాకారులకు ఏసిఏ అందజేస్తున్న ఇన్సూరెన్స్ కార్డులను ఎంపీ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రవి,సభ్యులు శ్రీధర్,శ్రీనివాస్ మూర్తి,ఖాదర్ భాషా,గిరి, హరి, వేణుగోపాల్ నాయుడు,సతీష్ యాదవ్, శివ, మార్కండేయులు, రమణ, కోచ్లు సునీల్, చిన్న బాబు, అనిత, చంద్రిక, రంజి ట్రోఫీ,రాష్ట్ర, జిల్లా క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మ లావణ్యకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యాజమాన్య శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి కొమ్మ లావణ్యకు డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసినట్లు సిఈ దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్మెంట్ శాస్త్ర విభాగపు విశ్రాంత ఆచార్యులు జే. దుర్గా రావు పర్యవేక్షణలో " యాన్ ఎవల్యూషన్ ఆఫ్ అప్రైజల్ ఇన్ సెలెక్టెడ్ ఐటీ కంపెనీస్ ఇన్ ఇండియా" అనే అంశంపై వర్సిటీకి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినట్లు వివరించారు. లావణ్య పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మ లావణ్యకు మేనేజ్మెంట్ విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనదారుడిపై దాడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాంగ్ రూట్లో వచ్చి ఢీకొన్నందుకు ప్రశ్నించిన వ్యక్తిపై మద్యం మత్తులో నలుగురు దాడికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన విష్ణువర్ధన్ ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మావతి పార్క్ బస్టాండ్ వద్ద బైక్‌పై వెళుతుండగా, ఎదురుగా రాంగ్ రూట్లో వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీన్ని ప్రశ్నించినందుకు మద్యం మత్తులో ఉన్న నలుగురు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఫిర్యాదు మేరకు అజయ్, రుద్ర, బబులు, తేజ రాయల్ అనే వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పేరూరు పంచాయతీ, హరిపురం కాలనీలో తెల్లవారుజామున 2-3 గంటల మధ్య నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి గురైంది. బాధితురాలి కథనం మేరకు హరిపురం కాలనీలో నివాసముంటున్న భార్యాభర్తలు, బుధవారం రాత్రి తమ ఇంటి మేడపై నిద్రించారు. ఉదయం నాలుగు గంటలకు లేచి చూడగా, మహిళా మెడలోని బంగారు గొలుసు, రెండు సెల్ ఫోన్లు కనపడకుండా పోయాయి. తమ వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : మూడో అంతస్తు పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తిరుపతిలో చోటుచేసుకుంది. రాజంపేటకు చెందిన గౌతమికి సుండుపల్లికి చెందిన వెంకటేష్‌తో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కెనడి నగర్, పద్మావతి అపార్ట్మెంట్‌లో వీరు కాపురముంటున్నారు. వెంకటేష్ వృతిరీత్యా మెడికల్ రెప్. అతను ఉదయం విధులకు వెళ్ళగా, కూతురు స్కూలుకు వెళ్ళింది. ఒంటరిగా ఉన్న గౌతమి 3 అంతస్తు నుండి క్రిందకు దూకడంతో మృతి చెందింది. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా మార్చురికి తరలించారు.మతిస్థిమితం సరిగాలేక, ఆత్మహత్య చేసుకొని ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలు తండ్రి సుబ్బరాయుడి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మూడునాళ్ళ ముచ్చటగా రహదారులు



ప్రజాశక్తి - ఓజిలి : మండలంలోని ఆర్.అండ్.బి రహదారులు మూడునాళ్ళ ముచ్చటగానే మారాయి. ప్రధాన రహదారులు గుంతల మయమై ప్రయాణికులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. రోడ్డు మీద ప్రయాణించాలంటే ప్రమాదానికి గురౌతామని భయభ్రాంతులు నెలకొన్నాయి. పరిమితికి మించి అధిక బరువుతో లారీలు రహదారిపై రాకపోకలు కొనసాగించడంతో రహదారులు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. ఓజిలి మండల కేంద్రం నుంచి కురుగొండ, చిల్లమానుచేను, కొండవల్లిపాడు, పెద్దపరియ రాచపాలెం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పెద్ద పెద్దగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పల్లెలకు ప్రధాన రహదారులు కావడంతో ఈ మార్గంలో వందల సంఖ్యలో వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. అంబులెన్సులు సైతం ఇక్కడకు వచ్చేసరికి గుంటలతో త్వరగా వెళ్లలేకున్నాయి. ఇటీవల కాలంలో ఆర్.ఆండ్.బి అధికారులు కొన్ని రహదారులకు మరమ్మత్తులు నిర్వహించారు. కానీ మరమ్మతులు నిర్వహించి ఏడాది కూడా గడవకముందే రహదారులు యధాస్థితికి చేరుకున్నాయి. మరమ్మతులలో నాణ్యత లోపమే కారణమని ప్రజలు మండి పడుతున్నారు. ప్యాచ్ పనులను నిర్వహించిన చోటే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రజాధనం కోట్ల రూపాయలు నీటిపాలయిందని వాహనచోదకులు పేర్కొంటున్నారు. వర్షం కురిస్తే గోతుల్లో నీరు నిలచి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రహదారులకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి, స్వర్ణముఖి మహిళా పరస్పర సహకార సంఘం లి. కార్యాలయంలో జ్యోతిరావు పూలే 198 వ జయంతిని గురువారం స్వమాక్స్ అధ్యక్షురాలు శివకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వమాక్స్ సీఈఓ సంగీతం విశ్వనాథ్ మాట్లాడుతూ పూలే బలహీన వర్గాల వారికి ఆదర్శంగా నిలిచినారని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు షర్మిల, నారాయణమ్మ, పద్మశ్రీ, జగదీశ్వరి, సిబ్బంది రామనాథరెడ్డి, సుబ్రమణ్యం, ఉమ, జయరామరెడ్డి, వెంకటేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

నరహరికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు వాణిజ్య శాస్త్ర విభాగపు పరిశోధక విద్యార్థి నరహరికి డాక్టరేట్‌ని ప్రధానం చేసినట్లు సిఈ దామ్లా నాయక్ తెలిపారు. వాణిజ్య శాస్త్ర విభాగపు ఆచార్యులు రాజశేఖర్ మార్గదర్శకత్వంలో సర్వీస్ క్వాలిటీ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ – ఎ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఎస్బిఐ అండ్ ఐసిఐసిఐ బ్యాంక్స్ ఇన్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై వర్సిటీకి సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించినట్లు వివరించారు. హరి జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్‌లో పరిశోధనా పత్రాలను ప్రచురించిన ట్లు తెలిపారు. ఈ సందర్భంగా "హరికి వాణిజ్య శాస్త్ర విభాగ ఆచార్యులు, అభినందనలు తెలిపారు.

ఘనంగా కుంభాభిషేక వేడుకలు

ప్రజాశక్తి -సత్యవేడు:సత్యవేడు పట్టణం, ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల ప్రాంగణంలోని శ్రీసుందర సిద్ధి వినాయక ఆలయంలో గురువారం కన్నుల పండుగ కుంభాభిషేక వేడుకలు జరిగాయి. శ్రీసుందర సిద్ధి వినాయక ఆలయం నిర్మించి 14 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో కొత్త గోపురం, స్వామివారికి వెండి కవచం, కలశ స్థాపన వంటి పనులను ప్రస్తుతం పూర్తిచేశారు. ఈ క్రమంలో ఆలయ నిర్వాహకులు కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ఆయన చేతుల మీదుగా రుత్వికులు కుంభాభిషేక ప్రక్రియను ప్రారంభించారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు, దాతలకు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు హేమభూషణం, దనేష్ కుమార్, శోభ తదితరుల పర్యవేక్షణలో ఘమ్ గణపతియే నమః అంటూ వందలాదిమంది భక్తుల నామస్మరణాల, మంగళ వాయిద్యాలు మారుమోగుతుండగా రుత్వికులు గణేష్ శర్మ, సుధాకర్ శర్మ, బాలసుబ్రమణ్యం శర్మ,నవీన్ కుమార్ శర్మ బృందం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండంలో పూజలు జరిపిన 24 కళాశ జలాలతో ఆలయ శిఖర గోపురాలకు పూజలు నిర్వహించి కుంభాభిషేకం జరిపారు. కుంభాభిషేక వేడుకలను పురస్కరించుకుని ఉదయం గణపతి పూజ, కలశ ఆవాహనం,సిద్ధి బుద్ధి సమేత పూజలు, నక్షత్రాల పూజ,నవగ్రహ పూజ నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ సిద్ధివినాయకస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.దాతలు తేజస్విని, ఉషారాణి,శ్రీనాథ్ ఆచారి,యమున,చెంచుబాబు తదితరులు ఆర్థిక సహకారం దాదాపు ఆరున్నర లక్షల రూపాయల వ్యయంతో సిద్ధివినాయక ఆలయంలో శిఖరగోపురం, స్వామి వారికి వెండి కవచం,కలశాన్ని నూతనంగా నిర్మించారు. కుంభాభిషేకం వేడుకల్లో అసంఖ్యాక భక్తులు పాల్గొని సిద్ధి వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోనే నాయుడు మెస్ అధినేత సంతోష్ కుమార్ ఉభయ దాతగా వ్యవహరించి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కుంభాభిషేక వేడుకల్లో ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి సురేష్,టిడిపి మాజీ మండల అధ్యక్షుడు పరమశివం, శివానందం,శశిమోహన్ నాయుడు,ఎంపిటిసి బాల సుందరం రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,వెంకటేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.


కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వాల్మీకి చరిత్రము పుస్తకావిష్కరణ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ ముద్రించిన 'వాల్మీకి చరిత్రము' గ్రంథాన్ని గురువారం ఎస్వీయూ ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య చిప్పాడ అప్పారావు ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత ఆదికావ్యమైన రామాయణం నిర్మించిన వాల్మీకి చరిత్ర ఈ గ్రంథలో వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కొంగర సురేంద్రబాబు, నాగభూషణ్ రెడ్డి, ఓఆర్ఐ సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఐసీడీఎస్ ప్రాజెక్టు పుత్తూరు పరిధిలోని శ్రీ రంగ చెరువు అంగన్వాడి కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ ప్రమీల మాట్లాడుతూ 6 నెలల వరకు కేవలం తల్లి పాలు ఇవ్వాలన్నారు. 7 నెలలు నిండిన పిల్లలకు ఇవ్వాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సంధ్య, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ సంతోషి అంగన్వాడి కార్యకర్తలు, సహాయకురాలు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం, మండలాలలో మైనర్లు ద్విచక్ర వాహనాలపై విన్యాసాలు చేస్తూ రోడ్డుపై వెళ్లే వారికి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. చాలా సందర్భాలలో వారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారు. వీరికి వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్‌టిఓ అధికారులు స్పందించి వారి ఆగడాలను అదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు.

తిరుపతి నగర డీఎస్పీగా భక్తవత్సలం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుపతి నగర డిఎస్పీగా ఎం.భక్తవత్సలానికి పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నగర డిఎస్పీగా పనిచేసిన వెంకట్ నారాయణ బదిలీపై వెళ్లారు. మహిళా డిఎస్పి శ్రీలత ఇన్చార్జిగా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది డిఎస్పీలు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో భాగంగా అమరావతిలో వెయిటింగ్ లో ఉన్న ఎం.భక్తవత్సలానికి తిరుపతి నగర్ డిఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.

పల్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలు



ప్రజాశక్తి - నాగలాపురం:నాగలాపురం మండలం సురుటపల్లిలోని ప్రదోష క్షేత్రమైన శ్రీ సర్వమంగళ దేవి సమేత శ్రీ పల్లి కొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం నందీశ్వరునికి ప్రదోష పూజలు భక్తి ప్రపత్తులతో జరిగింది. ఆలయంలో శ్రీ వాల్మీకేశ్వరునికి అభిముఖంగా కొలువు దీరిన నందీశ్వరునికి ఆలయ ప్రధాన అర్చకులు పంచామృతాలతో అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పలు రకాల పండ్లతో నైవేద్యం సమర్పించి, మహా హారతిని హారతులు ఇచ్చారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తిలను ప్రాకారోత్సవం నిర్వహించి ప్రదోష పూజ క్రతువును పరిసమాప్తం చేశారు. ప్రదోష పూజలలో పాల్గొన్న భక్తులు స్వామి వారు సేవలో తరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో లతా, సిబ్బంది పరువేక్షించారు.

జీతాలు లేక ఉద్యోగుల వెతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలో శాశ్వత, టైం స్కేల్, అకడమిక్ కన్సల్టెంట్లు, ఎన్.ఎం.ఆర్ ఉద్యోగులతోపాటు శాశ్వత ఉద్యోగులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని శాశ్వత బోధన, బోధనేతర సిబ్బంది సకాలంలో జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చిట్టమూరు మండలం, కొత్తపాలెం గ్రామానికి చెందిన రామ్మూర్తి అనే హృద్రోగికి సీఎం సహాయ నిధి నుండి నాలుగు లక్షల 50 వేల రూపాయలు మంజూరు పత్రాలను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం



ప్రజాశక్తి - రామచంద్రపురం : శ్రీరామనవమి వేడుకల సందర్భంగా మండలంలో శ్రీ సీతారాముల కళ్యాణం కమనీయంగా జరిగింది. గురువారం మండలంలోని అనుపల్లి, కొత్త కండిక గ్రామాలలో శ్రీ రామ మందిరాల వద్ద శ్రీ సీతారాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ సీతా సమేత రామ లక్ష్మణ, హనుమంతుని ఉత్సవ పీఠంపై అధిష్టింపజేసి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, బొందారాలను అందజేశారు. కళ్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని నూతనంగా నిర్మిస్తున్న గుండోడు కణం రోడ్డును పరిశీలించి, కళ్యాణోత్సవంలో పాల్గొని శ్రీ సీతారాముల స్వాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తెచ్చుకున్నారు. కల్యాణోత్సవం మాజీ ఎంపీపీ టీ కేశవులు నాయుడు కుటుంబ సభ్యులు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాణయోగా పీఠాధిపతి కైలాస్ గురూజీ, ఈ.ఉమాపతి నాయుడు జనార్దన్ చౌదరి, కోరా హరి ప్రసాద్, రాజమాణిక్యం నాయుడు, చంద్రమౌళి నాయుడు, మునిరత్నం నాయుడు, కే నరసింహారెడ్డి, కే ముద్దుకృష్ణారెడ్డి, ధనంజయులు, బాల వీరయ్య, రామిరెడ్డి, గ్రామస్తులు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

సుమతి మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రూరల్ మండలం, పరమేశ్వర మంగళం పంచాయతీ, కైలాసపురం గ్రామానికి చెందిన సుమతి మృతి చెందారు. విషయం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే గురువారం ఆమె భౌతిక కాయం సందర్శించి నివాళులర్పించారు ఆయన వెంట రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి బాలాజీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో మామిడి కవర్లు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: భాకరాపేటలోని బాలాజీ రైతు సంఘంలో మామిడి కవర్లు అందుబాటులో ఉన్నాయని మండల ఉద్యాన శాఖ అధికారిని శివకుమారి రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి పంటలో చీడపీడల నివారణకు కవర్లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, రాస్ సిబ్బంది, బాలాజీ రైతు సంఘం తరపున రైతులు, నెప్టం ప్రాజెక్ట్ నుంచి నాగరాజు, కిరణ్ పాల్గొన్నారు.

సబ్సిడిపై వ్యవసాయ పనిముట్లు



ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ అద్వర్యంలో గురువారం స్థానిక రైతు సేవా సహకార సంఘం ప్రాంగణంలో జరిగిన సబ్సిడిపై వ్యవసాయ పనిముట్లు పంపిణి జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ముందుగా జరిగిన సమావేశంలో విజయ శ్రీ మాట్లాడుతూ రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి సబ్సిడిలు ఇచ్చి వారి అవసరాలను తీరుస్తున్నారని అన్నారు.గతప్రభుత్వం ఎప్పుడు రైతుకు సబ్సిడిపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వలేదని విమర్శించారు. సమావేశం అనంతరం లబ్దిదారులను ఎమ్మెల్యే చేతులు మీదుగా సబ్సిడి ద్వారా వచ్చిన వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖా ఏడి అనిత, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, కార్యదర్శి ఏజీ కిషోర్,టీడీపీ నేతలు కొక్కు శంకరయ్య,దేవరెడ్డి సుధాకర్ రెడ్డి,శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డ్రామా జూనియర్స్ 8' జీ తెలుగులో

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాలను అందిస్తూ వినోదం పంచుతోంది ఛానల్ జీ తెలుగు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీస్తూ ప్రేక్షకాదరణతో విజయవంతంగా 7 సీజన్లు పూర్తి చేసుకున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఏప్రిల్ 12న ప్రారంభం కానుంది. ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు, మీ జీ తెలుగులో ప్రేక్షకులు హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైంది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభిస్తోంది. ప్రతిభ గల చిన్నారులను మరింత ప్రోత్సహించి వారిని ఆశీర్వదించేందుకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. వరుస హిట్ సినిమాలతో సక్సెస్ఫుల్ డైరెక్టర్‌గా రాణిస్తున్న అనిల్ రావిపుడి జీ తెలుగు డ్రామా జూనియర్స్ 8 షో ద్వారా బుల్లితెరపై మొదటిసారిగా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు.

ఫల సరుకులు పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు సొసైటీ ప్రాంతంలో ఉన్న రోటరీ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెల జరిగే హెల్పేజ్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 25 మంది నిరు పేద వృద్ధులకు , ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు రోటేరియన్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రోటేరియన్ జి.జి.నాయుడు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్స్ దశరధరామిరెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, రాంప్రసాద్, టీ.వి. రవికుమార్, బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.